విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- 18 కులవృత్తుల్లో వెలుగు నింపడమే లక్ష్యం
- గతంలో లోన్ తీసుకుని చెల్లించని వారు అనర్హులు


బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర కోరారు. బుధవారం సంబంధిత అధికారులతో విశ్వకర్మ పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం గురించి పట్టణాలు, మండలాల్లో స్వయం సహాయక బృందాలు, పట్టణాభివృద్ధి సంస్థ రిసోర్స్ పర్సన్స్ ద్వారా విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. చేతివృత్తుల వారి సంఖ్య గణనీయంగా ఉందన్నారు.

- కమ్మరి కుమ్మరి, వడ్రంగి, మంగలి, చాకలి, వడ్డెర, అవసలి, కంసాలి, కులవృత్తుల వంశ పారపర్యంగా కొనసాగుతున్న వారందరిని విశ్వకర్మలుగా పిలుస్తున్నారన్నారు.
- ఈ క్రమంలో 18 కులవృత్తుల వారి జీవితాల్లో వెలుగు నింపడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు.
- ప్రధానమంత్రి విశ్వకర్మ ఓ సరికొత్త పథకమని దీన్ని ప్రారంభించడంలో ముఖ్య ఉద్దేశం చేతివృత్తుల వారందరినీ కళా నైపుణ్యం కలానుగుణంగా వారి ఉత్పత్తులు, వాటి ప్రత్యేకతలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలన్నారు.
- స్వయం ఉపాధిగా తమతమ వృత్తిలో చేతి పనిముట్లు ఉపయోగిస్తూ.. జీవించే వడ్రంగి పనుల వారు, ఇనుప పనిముట్లు చేసే కమ్మరి, కంసాలి, చర్మకార వృత్తిలోని మోచీలు, వీధుల్లో తిరుగుతూ.. తాళాలు ఇతర మరమ్మతులు చేసే వారు, బీట కమ్మరి, బంగారు, వెండి తయారు చేసే అవసలి వారు, కుండలు చేసే కమ్మరి, బుట్టలల్లే మేదరి, ఇంటి నిర్మాణ పనుల్లో ఉండే ఉప్పరి, పోరకలు, తట్టులు చేసే ఎరుకల, బొమ్మలు చేసేవారు, చాకలి, మంగలి, పువ్వులు అల్లే వారు, దర్జీ, చేపలు పట్టే వలలు తయారు చేసేవారు, మొత్తం 18 కులవృత్తులు ఈ పథకానికి అర్హులని తెలియజేశారు.
- పనిముట్లకు ప్రోత్సాహకంగా రూ.15 వేలు అందించడంతో పాటు గుర్తింపు కార్డులు, ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు.
- తొలి విడత లక్ష రూపాయల వరకు రుణ సదుపాయంగా అందజేస్తారని తిరిగి 18 మాసాల్లో చెల్లించాలని వివరించారు.
- రెండో విడత రూ.2 లక్షల వరకు లోన్ అందజేస్తారని, 36 నెలల్లో తిరిగి చెల్లించాలని పేర్కొన్నారు. పీఎం స్వనిధి, ముద్ర, పీఎం ఈజీపీ ద్వారా లోన్ పొంది తిరిగి చెల్లించడంలో విఫలమైన వారికి ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి అనర్హులని తెలిపారు.
- సంప్రదాయ కళలకు నైపుణ్యానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిరంతరం సంభవిస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ఆధునిక పద్ధతులలో శిక్షణ 5 రోజుల నుంచి ఏడు రోజుల పాటు శిక్షణ అందిస్తారన్నారు.
- శిక్షణ పొందిన వారికి రోజుకు రూ.500 స్టైఫండ్ అందిస్తారని, ప్రాథమిక కళ నైపుణ్య విక్షణ, ఆధునిక కళ నైపుణ్య పెంపు కోసం 15 రోజుల పైచిలుకు శిక్షణ ప్రతిరోజు రూ.500 స్టైఫండ్‌ను అందిస్తారని తెలిపారు.
- శిక్షణ పొందిన వారికి నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ధ్రువీకరణలను అందజేస్తారని తెలిపారు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు, డిజిటల్ సేవా కేంద్రంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ వారు వివరాలను ధ్రువీకరిస్తారన్నారు. జిల్లా అమలు కమిటీ ఆమోదముద్ర వేస్తుందన్నారు. ఎంఎస్‌ఎంఈ, ఎంఎస్‌డీఈ బ్యాంకు తదితర అధికారులతో కూడిన కమిటీ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. మేనేజర్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి, టీఎంసీ శ్రీలత, రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి..

మణికొండ: ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకానికి కుల వృత్తులను వంశ పారపర్యంగా కొనసాగిస్తున్న వారంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ తెలిపారు. చేతి వృత్తులు నిర్వహించే వారి జీవితాల్లో వెలుగు నింపే క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చిందన్నారు. ఈ పథకం కింద వారికి రూ. 15 వేలు ప్రోత్సాహకంతో పాటు గుర్తింపు కార్డు, ధ్రువీకరణ పత్రం అందజేస్తారన్నారు. ఆధార్‌కార్డ్, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డులతో డిజిటల్ సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

ప్రభుత్వం మారినా తీరు మారలేదు..

ఏబీవీపీ హైదరాబాద్ కార్యదర్శి శ్రీకాంత్

శంషాబాద్: ప్రభుత్వం మారినా విద్యార్థుల కష్టాలు మాత్రం మారడం లేదని ఏబీవీపీ హైదరాబాద్ కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని శంషాబాద్ కన్వీనర్ మహేష్, విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. తెలంగాణలో ప్రముఖ పాత్ర వహించిన గత ప్రభుత్వం కూడా వారి సంక్షేమాన్ని విస్మరించడంతో ఓటర్లు బుద్ధి చెప్పి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టాలు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థి సంఘం నాయకులను ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రదీప్, అఖిల్, శ్రీకాంత్, మనీష్, మైపాల్, చందు, శివచరణ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేత

శంషాబాద్: పట్టణంలోని రాళ్లగూడ సర్వే నంబరు 572లో ఉన్న మిగులు భూమి వారసత్వంగా వచ్చిందని భూమికి సంబంధించిన పట్టాదారులు బుధవారం మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ముత్తాల వారసత్వంగా తమ తండ్రి సలివేంద్రి అడివి రెడ్డి 127 గుంటల భూమి వచ్చిందన్నారు. ఇందులో కొంత విక్రయించినప్పటికీ ఎవరికీ కూడా మిగులు భూమిని రోడ్డుగా చూపలేదన్నారు. దురుద్దేశపూర్వకంగా గత 15 రోజులుగా తీవ్ర ఒత్తిడి చేసి రోడ్డుగా మార్చాలంటున్నారని, దీనిపై దస్తావేజులను పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఎస్. రామకృష్ణారెడ్డి, రఘురాంరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలు ఉన్నారు.

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్


రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ వెటర్నరీ కళాశాలలోని ఈవీఎం మిషన్లను బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు వై.శ్రీధర్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కె.బాలరాజు, కాంగ్రెస్ నాయకులు ఎ.శ్రీనివాస్, బీఎస్పీ, ఎంఐఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గగన్ పహాడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. డ్రైనేజీ పైపులైన్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారుకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు జోగిరవి, తలారి చిన్న, తిరుపతిరెడ్డి, వినయ్‌రెడ్డి, వల్లూరి శ్రీను, అడికెజనార్దన్, శేఖర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న మైనర్..

కేసు నమోదు

రాజేంద్రనగర్: ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఓ మైనర్ బాలుడిని స్థానికులు పట్టుకుని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల ప్రాంతం నుంచి ఓ కుటుంబం బండ్లగూడ ప్రాంతానికి వలస వచ్చింది. వీరి కుమారుడు చెడు అలవాట్లకు బానిసై సంధ్యానగర్, వేంకటేశ్వర కాలనీల్లో దొంగతనాలకు అలవాటు పడ్డాడు. ఇళ్లల్లోని ల్యాప్‌టాప్, ఐప్యాడ్‌తో పాటు నగదును సైతం దొంగలించాడు. గమనించిన స్థానికులు వేంకటేశ్వర కాలనీలో బాలున్ని పట్టుకుని తనిఖీ చేయగా దొంగలించిన బయటపడ్డాయి. దీంతో అతడిని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం


నర్కూడలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ గౌతమిఅశోక్

శంషాబాద్ రూరల్: పారిశుద్ధ్య నిర్వహణలో పంచాయతీ సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఎంపీటీసీ సభ్యురాలు తొంట గౌతమిఅశోక్ అన్నారు. బుధవారం మండలంలోని నర్కూడ, చౌదరిగూడ గ్రామాల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో కలిసి గ్రామాల్లో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులు శ్రద్ధ చూపాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరణ సిబ్బందికి ఇవ్వాలన్నారు. వేసవి దృష్ట్యా తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. స్పెషల్ ఆఫీసర్, ఎంపీఓ ఉషాకిరణ్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

సీఎంకు బహిరంగ క్షమాపణ చెప్పాలి


జిల్లా యువజన కాంగ్రెస్ నేత గుంటి ప్రవీణ్‌కుమార్

శంషాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు గుంటి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్షమాపణ చెప్పకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బాల్కసుమన్ తన స్థాయి మరచిపోయి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో చోరీ

అత్తాపూర్: అమ్మవారి గుడిలో విలువైన వస్తువులతో పాటు హుండీలోని నగదును దుండగులు దోచుకెళ్లిన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై నిమ్మల వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి విజయానంద్ క్రికెట్ గార్డెన్ ఎదురుగా ఉన్న దేవాలయంలో మంగళవారం రాత్రి ఈ దొంగతనం జరిగినట్లు సమాచారం. బుధవారం ఉదయం ఆలయ పూజారి వచ్చి చూడగా.. గుడి తాళాలు ధ్వంసమై కనిపించాయి. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నామన్నారు.

డ్రగ్ ఫ్రీ హైదరాబాద్‌కు సహకరించాలి



- మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్

గచ్చిబౌలి: స్టార్ హోటళ్లలో డ్రగ్స్‌కు అనుమతి ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ స్పష్టం చేశారు. మాదాపూర్ జోన్ పరిధిలోని స్టార్ హోటళ్ల నిర్వాహకులు, యజమానులతో ఆయన బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డ్రగ్ ఫ్రీ తెలంగాణ, డ్రగ్ ఫ్రీ హైదరాబాద్‌కు ప్రతి ఒక్కరూ విధిగా సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి డ్రగ్స్‌కు అనుమతిస్తే ఎండీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టార్ హోటళ్లలో మైనర్లకు మద్యం విక్రయించరాదని, ఇవ్వరాదని సూచించారు. ప్రైవేటు పార్టీలకు అనుమతించే సమయంలో డ్రగ్స్ లేకుండా పార్టీలు జరిగే చూడాలని, అయినప్పటికీ డ్రగ్స్ వినియోగించినట్లు సమాచారం వస్తే వినియోగించిన, సరఫరా చేసిన హోటల్‌పై కూడా చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని హెచ్చరించారు. సమావేశంలో మాదాపూర్ ఏడీసీపీ నర్సింహ్మారెడ్డి, ఇన్‌స్పెక్టర్ జేమ్స్‌బాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా విజయభాస్కర్



రాయదుర్గం: ఐఐఎం–వైజాగ్‌లో డాక్టర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన విజయభాస్కర్ మారిశెట్టి నియమితులయ్యారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న విజయభాస్కర్ విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లో డాక్టర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. అంబేడ్కర్ చైర్‌లో ముఖ్యంగా దేశంలో సామాజికంగా వెనుకబడిన సమాజాలను ఉద్ధరించే లక్ష్యంతో పరిశోధన, శిక్షణా కార్యక్రమాలు, ఫీల్డ్ వర్క్, బోధనా కార్యకలాపాలను నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తుంది. కాగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలి


డైరీని ఆవిష్కరించిన సంఘం ప్రతినిధులు

అఫ్జల్‌గంజ్: గంగపుత్రులు అన్ని రంగాల్లో రాణించాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి పిలుపునిచ్చారు. బుధవారం అఫ్జల్‌గంజ్‌లోని గంగపుత్ర సంఘం భవనంలో సంఘం 10వ వార్షిక డైరీని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని గంగపుత్రుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో గంగపుత్రులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో డైరీ కన్వీనర్ ఎర్ర బోయిన మల్లేష్, ట్రాఫిక్ పోలీస్ అధికారి సందిరి సంపత్, టీఎస్జీవోల సంఘం నగర అధ్యక్షుడు కె శ్రీకాంత్, జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి లక్ష్మయ్య పాల్గొన్నారు.

12 నుంచి నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



యాకుత్‌పురా: నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు వైద్య ఆరోగ్య, విద్యాశాఖల సహకారంతో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుకు నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నామని విద్యాశాఖ చార్మినార్ మండల డిప్యూటీ ఈఓ నెహ్రూబాబు, వైద్య విధాన పరిషత్ యాకుత్‌పురా–2 యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆయేషా ముద్దాసిర్ తెలిపారు. పురానీహవేలీలోని సక్సెస్ పాఠశాలలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..1 నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నులి పురుగుల నివారణకు ప్రతి ఏడాది ఫిబ్రవరి, ఆగస్టు నెలలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నామన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ చార్మినార్ ప్రాజెక్టు సీడీపీఓ జోత్స్న, వైద్యాధికారులు డాక్టర్ ఫర్హా, డాక్టర్ సనా, డాక్టర్ తబసుం పాల్గొన్నారు.

మేరు కులస్తులకు రాజ్యసభ స్థానం కేటాయించాలి


మంత్రిని సన్మానిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: మేరు కులస్తులకు రాజ్యసభ స్థానం కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర కాంగెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ మేరు పేర్కొన్నారు. రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో తనకు రాజ్యసభ సభ్యుడిగా కేటాయించేందుకు కృషి చేయాలని పోల్కం శ్రీనివాస్ మంత్రి కొండా సురేఖకు విజ్ఞప్తి చేశారు. శాలువాతో ఆమెను ఘనంగా సత్కరించి వినతిపత్రం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ..అసెంబ్లీ రాబోయే రాజ్యసభ, పార్లమెంట్ ఎన్నికల్లో తమ కులస్తులకు ప్రాధాన్యమివ్వాలని, ఎంతో వెనుకబడి మేరు కులస్తులకు అండగా ఉండాలన్నారు. త్వరలోనే ఆల్ ఇండియా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ కార్గే, ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీని కలిసి విజ్ఞప్తి చేస్తామని పోల్కం శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్పందించారు. మేరు కులస్తులకు అండగా ఉండేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కృష్ణ


నియామకపత్రం అందుకుంటున్న దృశ్యం

మణికొండ: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ గ్రామానికి చెందిన యువ నాయకుడు పెద్దపులి కృష్ణను జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నియమించారు. బుధవారం ఆయన చేతుల మీదుగా కిషన్ నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖానాపూర్ గ్రామంతో పాటు నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ అభివృద్ధికి కృషి చేసినందుకు జిల్లా స్థాయి పదవిని ఇచ్చారన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకునేలా భవిష్యత్తులో పార్టీ పటిష్టతకు మరింత కృషి చేస్తానన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టీపీసీసీ సభ్యుడు ముంగి జైపాల్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కస్తూరి నరేందర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ అధ్యక్షుడు అశోక్ యాదవ్, ఖానాపూర్ మాజీ సర్పంచ్ గండయ్య అభినందించారు.

స్క్రాప్, ఫోమ్ గోదాంలో అగ్నిప్రమాదం

రూ.30 లక్షల మేర ఆస్తినష్టం

మైలార్‌దేవ్‌పల్లి: స్క్రాప్, ఫోమ్ కంపెనీ గోదాంలో అగ్నిప్రమాదం జరిగిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జిల్లా ఫైర్ అధికారి పూర్ణచందర్ తెలిపిన వివరాల ప్రకారం.. చార్మినార్ ప్రాంతానికి చెందిన అస్లాం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని టాటానగర్ ప్రాంతంలో స్క్రాప్, ఫోమ్ కంపెనీ గోదామ్‌లలో మెటీరియల్ నిల్వ ఉంచారు. మంగళవారం అర్ధరాత్రి 11.30 సమయంలో స్క్రాప్ కంపెనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో కంపెనీకి ఆనుకుని ఉన్న ఫోమ్ గోదాంలో నిప్పురవ్వలు పడి ఫోమ్ గోదాంలో భారీగా మంటలు చెలరేగాయి. కంపెనీలో ఉన్న కార్మికులు బయటికి రావడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. ఐదు ఫైర్ ఇంజిన్లతో రంగంలోకి దిగిన జిల్లా ఫైర్ అధికారి పూర్ణచందర్, ఫైర్ ఇన్‌స్పెక్టర్ చంద్రనాయక్ సిబ్బందితో గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. రూ.30 లక్షల సరుకు కాలి బుడిదైందని యజమాని రోధించారు.

జాతీయ యోగా పోటీల్లో రాణించిన ప్రశాంత్



మణికొండ: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగిన జాతీయస్థాయి యోగాసన పోటీల్లో మణికొండ మున్సిపాలిటీ, తిరుమలహిల్స్ కాలనీకి చెందిన ప్రశాంత్‌కన్నన్ ఉత్తమ ప్రతిభ చాటి 31 నుంచి 41 ఏళ్ల విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.కాంతారావు, నాయకులు రంగాచారి, డాక్టర్ అవినాష్, భరత్‌కుమార్‌లు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. సందర్భంగా యోగా గురువు కె. ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. యోగాతో మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని, ప్రతి ఒక్కరూ తమకు వీలు దొరికిన సమయంలో యోగా చేయాలని సూచించారు.

గుర్తు తెలియని మహిళ మృతి

మణికొండ: గుర్తు తెలియని యాచక మహిళ రోడ్డు పక్కన మృతి చెందిన ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ రోడ్డు పక్కన పడి ఉన్న విషయాన్ని పెట్రోలింగ్ పోలీసులు గుర్తించారు. ఆమె పరిస్థితి చూస్తే యాచకురాలిగా కనిపించడం, అనారోగ్యంతో మృతి చెందినట్టు వారు భావించారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆమెకు 40 నుంచి 45 ఏళ్లు, ఉంటాయన్నారు. సంబంధీకులు గుర్తిస్తే నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

- రూ.36 లక్షలతో నిర్మించిన 'వి డ్రీమ్, నిర్మాణ్ ఆర్గనైజేషన్
- ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు గదుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ హయాంలో అనేక ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలలను మనసున్న వారు ఎవరైనా దత్తత తీసుకుని అభివృద్ధి చేసే అవకాశం బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవకాశం కల్పించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వీ డ్రీమ్, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో రూ.36 లక్షలను వెచ్చించి పాఠశాల అదనపు గదులను నిర్మించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. 'వి డ్రీమ్ నిర్మాణ సంస్థ ప్రతినిధులు కుమారి కీమ్ యాన్, ప్రదీప్ కుమార్, సుబ్బారావు, దివ్య, నిర్మాణ్ ఆర్గనైజేషన్ అనురాధ, సబా, అబ్దుల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, ప్రేమ్‌గౌడ్, గంజి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన వేతనాలు అమలు చేయాలి



రాజేంద్రనగర్: కార్మికులందరికీ పెరిగిన వేతనాలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కార్మికులతో కలిసి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ ఫిబ్రవరి 2న రూ.1000 గౌరవ వేతనం పెంచుతూ.. సర్క్యులర్ విడుదల చేసిందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని అనేక పోరాటాలు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేయి రూపాయలు పెంచడం అన్యాయమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు రూ.26 వేలు పెంచాలని డిమాండ్ చేశారు.

పోలీసు సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి


పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న మెడికవర్ డాక్టర్లు

రాయదుర్గం: పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సైబరాబాద్ డీసీపీ (క్రైమ్స్) కొత్తపల్లి నర్సింహ సూచించారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లోని సీటీసీ కార్యాలయంలో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలను విధిగా చేయించుకోవాలని సూచించారు. 1022 హోంగార్డులు, సిబ్బందికి పలు వైద్య పరీక్షలను నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి కార్డియాలజీ, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్ డాక్టర్లు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ డాక్టర్ దుర్గేష్ శివ, సీటీసీ డాక్టర్లు సరిత, సుకుమార్, అదపు డీసీపీ రవి చందన్‌రెడ్డి, ఏసీపీ హోంగార్డ్స్ కృష్ణ, పోలీసు అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.